క్లుప్తంగా

లబ్ధిదారులు త్వరగా ఇల్లు నిర్మించుకోవాలి



మాట్లాడుతున్న కమిషనర్ మనోహర్

కందుకూరు అర్బన్: పట్టణంలోని ఉప్పుచెరులోని వరాలసాయినగర్ లేఔట్‌లో బేస్‌మెంట్ వేసుకున్న లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మించుకోవాలని కమిషనర్ ఎస్. మనోహర్ చెప్పారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు లబ్ధిదారులతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎస్. మనోహర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇస్తుందన్నారు. లబ్ధిదారులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ, డీఈలు పాల్గొన్నారు.

వేసవిలో పిల్లలు జాగ్రత్త

పొన్నలూరు: వేసవి సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై దాసరి రాజారావు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మహిళా పోలీసులతో కలిసి విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. భోగనంపాడులో మహిళా పోలీస్ సయ్యద్ తస్లీమా ప్రజలతో మాట్లాడుతూ పిల్లలకు వేసవి సెలవులు వస్తుండటంతో ఈత కోసం కుంటలు, వాగుల దగ్గరకు వెళ్లకుండా అవగాహన కల్పించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

హనుమంతునిపాడు: మండుటెండలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెర్వు సత్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక సీతారాంపురం బస్టాండ్ సెంటర్‌లో సర్పంచ్ మారంరెడ్డి వాణి భర్త మారంరెడ్డి రవీంద్రారెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు మజ్జిగ, తాగునీరు అందించారు. మారంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, హనుమంతునిపాడు సర్పంచ్ కత్తిరాజారావు, నందనవనం ఎంపీటీసీ నారాయణస్వామి, ఎం. గోపాలరెడ్డి, గ్రామస్తులు కందుల రమణారెడ్డి, యోగిరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంచర్‌ని పరిశీలించిన తహసీల్దార్

కొండపి: స్థానిక టంగుటూరు రోడ్డులో సర్వేనంబరు 137లోని 5ఎకరాల 60 సెంట్ల స్థలంలో వేస్తున్న వెంచర్‌ని గురువారం తహసీల్దార్ పి. సింగారావు పరిశీలించారు. వెంచర్ వేయటానికి అనుమతులు కోరుతు భూమార్పిడి కోసం దరఖాస్తు చేసుకుని నగదు చెల్లించటంతో సిబ్బందితో తహసీల్దార్ భూమివద్దకు వచ్చారు. అనుమతులు రాకుండానే వెంచర్ వేస్తున్న విషయం గమనించి ఆర్‌డీఓకి నివేదిక ఇవ్వనున్నట్లు తహసీల్దార్ సింగారావు విలేకరులకు తెలిపారు. ఆర్ఐ హనుమంతరావు, సర్వేయర్ ఫయాజ్ ఉన్నారు.

19 మద్యం బాటిళ్లు సీజ్

టంగుటూరు: మండలంలోని పొందూరు గ్రామంలో కొండ్రుల వెలుగొండయ్య అక్రమంగా మద్యం అమ్ముతుండగా 19 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని గురువారం సీజ్ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్సై ఖాదర్ బాషా తెలిపారు.

గడప గడపకు మన ప్రభుత్వం నేడు

సింగరాయకొండ: మండలంలోని బింగినపల్లిలో శుక్రవారం ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

- ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్



భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. పట్టణంలోని అర్బన్ కాలనీ ఏరియాలోని హెలిప్యాడ్ స్థలం, దాని పక్కన ఉన్న స్థలాన్ని గురువారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ యు పుల్లారావు మాట్లాడుతూ హెలిప్యాడ్ స్థలంలో ఎటువంటి ఆక్రమణలు జరగలేదని, పక్కనే ఉన్న సర్వే నంబర్‌లో 31 భూమిలో కొందరు మట్టి పోశారని ఎమ్మెల్యేకు వివరించారు. అయితే ఆ స్థలంలో కొంత భూమి సబ్‌స్టేషన్ నిర్మాణంలో ఉండగా, మరి కొంత భూమి ఖాళీగా వాగు పోరంబోకుగా ఉందని వీఆర్వో వివరించారు. సర్వేయర్ సెలవులో ఉన్నారని, రెండు రోజుల్లో సమగ్రంగా సర్వే చేయించి హద్దు రాళ్ల పాతుతామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ సర్వే నంబర్ 31లో ఉన్న 3 ఎకరాల మేత పోరంబోగు, వాగు పోరంబోగు భూమికి, అలాగే సర్వే నంబర్ 29లోని 4.65 ఎకరాల హెలిప్యాడ్ స్థల ఏరియాను సమగ్రంగా సర్వే చేసి హద్దు రాళ్లు నాటి, ఫెన్సింగ్ వేసి ఆ రెండు స్థలాలు ప్రభుత్వ భూములుగా బోర్డులు పెట్టాలని ఆదేశించారు. వారం రోజుల్లో సమగ్రంగా ఈ ప్రక్రియను పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారు ఎంతటి వారైన ఉపేక్షించేది లేదన్నారు. సర్వే నంబర్ 31లో భూమిని చదును చేసి, మట్టి పోసిన వ్యక్తులను గుర్తించి వారిపై కేసులను పెట్టాలని తహసీల్దార్ యు పుల్లారావును ఆదేశించారు. ప్రభుత్వ భూమి సెంటు కూడా ఆక్రమణకు గురి కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సీఎస్‌పురం మండలంకు చెందిన ఓ వ్యక్తి భూ అక్రమణలకు పాల్పడుతున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని చైర్మన్ అబ్దుల్ గఫార్ ఎమ్మెల్యే బుర్రాకు చెప్పారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ తక్షణం విచారించి తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, వీఆర్వోలను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, కౌన్సిలర్లు వేల్పుల వెంకటేశ్వర్లు, పెన్నా ఏడుకొండలు, దాసరి మురళీ, రెవిన్యూ, సచివాలయ అధికారులున్నారు.

యల్లమందారెడ్డి జీవితం ఆదర్శం



పామూరులో యల్లమందారెడ్డికి నివాళులర్పిస్తున్న నేతలు

పామూరు: సీపీఐ సీనియర్ నాయకుడు దివంగత గుజ్జుల యల్లమందారెడ్డి జీవితాన్ని నేటి నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ మౌలాలి అన్నారు. కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గుజ్జుల యల్లమందారెడ్డి వర్ధంతిని స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి సీపీఐ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. యల్లమందారెడ్డి చిత్రపటానికి నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి వజ్రాల సుబ్బారావు, మండల సహాయ కార్యదర్శి రాగిపాటి సూరిబాబు, ఏఐటీయూసీ నాయకులు నరసింహారావు, అబ్బిశెట్టి, ఆకుల మోహన్‌రావు, రఘునాథరెడ్డి, మహేష్, చాంద్‌బాషా, ప్రసాద్ పాల్గొన్నారు.

కందుకూరు అర్బన్: స్థానిక సీపీఐ కార్యాలయంలో గుజ్జుల యలమందారెడ్డి వర్ధంతిని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య మాట్లాడుతూ యల్లమందారెడ్డి జీవితమంతా పోరాటాలతో కొనసాగిందన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్‌బాబు, సహాయ కార్యదర్శి పి. బాలకోటయ్య, వై. ఆనంద్‌మోహన్, ఆదినారాయణ, లక్ష్మీనారాయణ, ఎస్ రామారావు, వై కొండయ్య పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: సీపీఐ జాతీయ నాయకుడు దివంగత గుజ్జుల యల్లమందారెడ్డి చిరస్మరణీయుడని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు వై రవీంద్రబాబు అన్నారు. స్థానిక దర్శి చెంచయ్య భవన్‌లో గురువారం గుజ్జుల యల్లమందారెడ్డి వర్ధంతిని నిర్వహించారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసిన మహానీయుడన్నారు. నాయకులు జీపీ రామారావు బృంగి సుబ్రహ్మణ్యం, గుజ్జుల బాలిరెడ్డి, జీపీ గాయత్రి, డీహెచ్ పీఎస్ జిల్లా అధ్యక్షుడు పందిటి మోహన్, వెంకటేశ్వర్లు, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

పేదవాడి ఆకలి తీర్చడమే జగనన్న ధ్యేయం



బింగినపల్లి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న వరికూటి

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

సింగరాయకొండ: ప్రతి పేదవాని నోట్లో నాలుగ వేళ్ల పోయేలా చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. బింగినపల్లి పంచాయతీ పెద్దన్నపాలెంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడారు. అయ్యా మా పెద్ద కొడుకు ఎప్పటికి జగన్‌మోహన్‌రెడ్డే అని ఓ వృద్ధురాలు చెప్పిందని.. తాను బతికి ఉన్నంతకాలం జగన్‌కే ఓటు వేసి రుణం తీర్చుకుంటానని చెప్పిందని వివరించారు.

వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, పోట్లూరి శ్రీనివాసులు, అల్లూరి యానాది, పురిణి శ్రీనివాసులరెడ్డి, తంబు రఘురామయ్య, షేక్ సలీం బాషా, మాదాల నారాయణ, ఆదిపోగు చిన్నా, ఆదిపోగు దత్తు, వాకా బాలకృష్ణారెడ్డి, యరమాల సుబ్బారావు పాల్గొన్నారు.

ఇంటర్‌లో విద్యార్థుల ప్రతిభ

మద్దిపూడి: ఇంటర్‌మీడియెట్ పబ్లిక్ ఫలితాల్లో మద్రిపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 40.4 శాతం మంది, ద్వితీయ సంవత్సరంలో 75 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. కళాశాల ప్రిన్స్‌పాల్ ఆర్. కోటయ్య విద్యార్థులను అభినందించారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

జరుగుమల్లి (సింగరాయకొండ): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తామని ఎంపీడీఓ పి. రామకృష్ణ అన్నారు. జరుగుమల్లి మండలం నర్సింగోలు గ్రామ సచివాలయం పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను గురువారం ఉదయం పర్యవేక్షించారు. కూలీలు 87 మంది పని ప్రదేశంలో ఉండగా వారి హాజరు రిజిష్టరు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కూలీలు పని చేసిన ప్రదేశాన్ని కొలతలు వేసి ఎం బుక్ ప్రకారం కొలతలు ఉన్నదీ లేనిదీ తనిఖీ చేశారు. ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ ఈ పథకం కింద జరుగుతున్న పనుల్లో ఎటువంటి అవకతవకలు జరిగినా సహించేది లేదన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో పి. అజయ్ 947, బైపీసీలో పి.వాణి 854 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో సీఈసీలో ఆర్ పరిశుద్ధమ్మ 432 సాధించింది. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్ పి.రమణారెడ్డి, అధ్యాపక, సిబ్బంది అభినందించారు. ఎంఎస్‌ఎం విజేత జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎస్‌కే అబ్దుల్ సమద్ ఎంపీసీ(ఇఎం)లో 985, సయ్యద్ మెహతాబ్ 974 మార్కులు సాధించారు. మొదటి సంవత్సర ఎంపీసీలో బీవీఎస్ మారుతీ 462 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ పసుపులేటి అరుణోదర్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, చైర్మన్ అబ్దుల్ గఫార్‌లు అభినందించారు. కృష్ణ చైతన్య కళాశాలకు చెందిన జి.అంకబాబు ఎంపీసీలో 461, సీఈసీలో శశీధర్‌రెడ్డి 467, బైపీసీలో ఏ లలిత 419 మార్కులు సాధించారు.

కందుకూరు: సీనియర్, జూనియర్ ఇంటర్ ఫలితాల్లో తిక్కవరపు రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ కదిరి నాగేశ్వరరావు తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీ విభాగం విద్యార్థులు కోలా మధు 965 మార్కులు, పసుపులేటి వెంకటబాలరాజు 943, కొచ్చెర్ల అకాశ 937, మాచర్ల పవన్‌కుమార్ 934 మార్కులు సాధించినట్లు తెలిపారు. బైపీసీలో సీహెచ్ సూర్యనారాయణ 817, సీఈసీలో షేక్ సైదాబీ 904మార్కులు, హెచ్ఈసీ విభాగంలో 687, ఓఎస్ విభాగంలో నవీనాకు 902, ఎంపీహెచ్‌డబ్ల్యులో ఎస్ కౌసల్య 814 మార్కులు సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో కుడుముల అఖిల 431 మార్కులు, బి.రాణి 413, బి. శ్రీలత 399 సాధించారు. బైపీసీ విభాగంలో వి.నాగలక్ష్మి, రేవంత్ సాయిలు 404 మార్కులు సాధించారు.

పామూరు: ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గుత్తి వెంకట రమణయ్య ఎంపీసీలో షేక్.రేష్మ, బైపీసీ విభాగంగాలో సత్తాచాటిన షేక్.థాసిఫ్, సీఈసీలో వై.శిరీష, హెచ్ఈసీలో షేక్.నాగూర్‌బీ, యం.వి.వెంకటరమణ, జి.మరియమ్మలను ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

ఇంటర్ పరీక్షల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

కొండపి: స్థాక గురుకుల జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్. కోటేశ్వరరావు గురువారం తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 84.72శాతంతో 31మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సర పరీక్షలను 76మంది విద్యార్థులు రాయగా 54మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. చాణక్య జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ పి. రాజ్యలక్ష్మి తెలిపారు. కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు సెకండ్ ఇయర్‌లో 128 మంది పరీక్షలు రాయగా 58మంది ఉత్తీర్ణత సాధించినట్లు, ప్రథమ సంవత్సరం విద్యార్థులు 102మంది రాయగా 24 మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మామిళ్ళపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు.

మండల సమావేశం రేపు

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 29వ తేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి. రామకృష్ణ తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు పాల్గొనాలన్నారు.



పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

ప్రతి ఇంటికి సంక్షేమ లబ్ధి

- పేదలను ఆర్థికంగా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం
- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

కందుకూరు: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. గుడ్లూరు మండలంలోని దారకానిపాడు గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఇంటికి వెళ్లిన ఆయన పథకాల సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని వివరించారు. వృద్ధులకు పింఛన్ల దగ్గర నుంచి రైతు భరోసా, పంటల భీమా, ధరల స్థిరీకరణ నిధి, మహిళలకు చేయూత, ఆసరా, విద్యార్థులు విద్యాదీవెన, వసతి దీవెన వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారని వివరించారు. పథకాలు అందించడంలో ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పథకాల అమల్లో ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే తన దృష్టికి లేదా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో సచివాలయ వ్యవస్థ ద్వారా నిత్యం అధికారులు, వలంటీర్లు అందుబాటులో ఉంటున్నారని వారి ద్వారా కూడా సమస్యలను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. అలాగే అభివృద్ధి కార్యక్రమాలను సమాన స్థాయిలో ప్రభుత్వం చేపడుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల మనకు ఎంత మేలు జరిగిందనే విషయాన్ని ప్రతి కుటుంబం ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో గుడ్లూరు ఎంపీపీ పులి రమేష్, జెడ్పీటీసీ కోర్నిపాటి బాపిరెడ్డి, ఎంపీటీసీ బొందల ప్రభాకర్, సర్పంచ్ చిత్తారి చెంచమ్మ, నాయకులు యరగొర్ల నరశింగరావు, గొర్ల నాగేశ్వరరావు, సుజాత, దగ్గుబాటి కృష్ణయ్య, దేవకుమార్, గుడ్లూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి

- శివారు ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా
- ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్



సబ్ స్టేషన్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: పట్టణంలోని అర్బన్ కాలనీ సమీపంలో రూ.2.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణ పనులను గురువారం ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ సబ్ సేష్టన్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మే నెలాఖరు లోగా పనులు పూర్తి చేసి, సబ్‌స్టేషన్‌ను ప్రారంభించి ప్రజలకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్‌ను అందచేయాలని అధికారులను ఆదేశించారు. సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తితే కనిగిరి పట్టణంతో పాటు అర్బన్ కాలనీ, చాకిరాల, చల్లగిరిగిల్ల తదితర ఫీడర్‌లకు మెరుగైన నాణ్యతమైన విద్యుత్‌ను అందించవచ్చని తెలిపారు. అంతేగాక లో ఓల్టేజీ సమస్య పరిష్కారమవుతుందన్నారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కమిషనర్ డీవీస్ నారాయణరావు, తహసీల్దార్ యు పుల్లారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకుల రెడ్డి, కౌన్సిలర్లు వేల్పుల వెంకటేశ్వర్లు, దాసరి మురళీ, పెన్నా ఏడుకొండలు, రాజేష్, రెవిన్యూ, విద్యుత్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన



తిమ్మారెడ్డిపల్లిలో జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లు అంటిస్తున్న గృహ సారథులు

హనుమంతునిపాడు: ప్రజా సంక్షేమమే వైఎస్సార్ ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి అన్నారు. గురువారం తిమ్మారెడ్డిపల్లిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్లు, వలంటీర్లు, నాయకులు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొని స్టిక్కర్లు అంటించారు. పార్టీ నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు జాబితా చదివి వినిపించారు. గతంలో ఇన్ని సంక్షేమ పథకాలు ఇచ్చిన ప్రభుత్వం ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అవినీతిని వివరించారు. మండల గృహ సారథులు కన్వీనరు మద్ది తిరుపతయ్య, మండల రైతు సంఘ అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, యూత్ అధ్యక్షుడు భవనం క్రిష్ణారెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేశపోగు గురుప్రసాదు, కో ఆర్డినేటర్ చెక్కా రాము, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

దొంగ సంతకాలతో రుణాలు

- కనుమళ్ల ఎస్టీ కాలనీ డ్వాక్రా గ్రూపు సభ్యుల ఆందోళన



ఎంపీడీఓ జమీఉల్లాతో మాట్లాడుతున్న కనుమళ్ల ఎస్టీ కాలనీ మహిళలు

సింగరాయకొండ: తమకు తెలియకుండానే తమ సంతకాలతో తీర్మానాలు చేసి రుణాలు మంజూరయ్యేలా వీఓఏ పత్తిపాటి పద్మ వ్యవహరించిందంటూ కనుమళ్ల ఎస్టీ కాలనీ డ్వాక్రా గ్రూపు మహిళలు ఎంపీడీఓ షేక్ జమీఉల్లాకు ఆయన కార్యాలయంలో ఫిర్యాదు చేసిన సంఘటన గురువారం జరిగింది. డ్వాక్రా గ్రూపు మహిళల కథనం ప్రకారం.. ఇటీవల రూ. 13.50 లక్షల విలువ గల బాతు గుడ్ల మిషన్ యూనిట్ కోసం 50 మంది వరకు దరఖాస్తు చేసుకోగా 13 యూనిట్లు మంజూరయ్యాయి. ఈ యూనిట్లకు సుమారు రూ. 11 లక్షలు బ్యాంకు రుణంగా ఇస్తుండగా మిగిలిన 2.50 లక్షల రూపాయలను ఐకేపీ అధికారులు ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేస్తారు. ఈ మొత్తం ప్రక్రియకు గ్రూపు సభ్యుల తీర్మానాలు తప్పనిసరి. అయితే కనుమళ్ల ఎస్టీ కాలనీలోని వాసవి గ్రూపు, మరియమ్మ గ్రూపు, శ్రీనివాస గ్రూపు, శాంతి గ్రూపు, ప్రకాశం గ్రూపు, బాలత్రిపురాంబ గ్రూపులున్నాయి. కానీ వివరాలు చెప్పకుండా వైఎస్సార్ ఆసరా డబ్బు డ్రా చేయాలంటే తీర్మానాలు కావాలని చెప్పి వీఓఏ పద్మ కొన్ని గ్రూపుల వద్ద సంతకాలు తీసుకుంది. మరి కొన్ని గ్రూపుల సభ్యుల సంతకాలు తానే పెట్టి తీర్మానాలు చేసిందని వారు ఆరోపించారు. ఇటీవల ఆసరా డబ్బుల కోసం బ్యాంకుకు వెళ్లిన గ్రూపు సభ్యులకు విషయం తెలియడంతో అవాక్కయ్యారు. వీఓఏ పద్మ, పి. ప్రసాద్, సుందరరావుతో పాటు మరో ఇద్దరు కారకులని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీఎంతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని ఎంపీడీఓ చెప్పడంతో గ్రూపు సభ్యులు శాంతించారు. దీనిపై ఏపీఎం డి. జాయరాజ్‌ను వివరణ కోరగా యూనిట్ల మంజూరులో ఎటువంటి అవకతవకలు జరగలేదని అంతా నిబంధనల ప్రకారం చేశామని వివరించారు. వీఓఏ పద్మ దొంగ సంతకాలు పెట్టి తీర్మానాలు చేసిందని చెప్పడం అవాస్తవం అని ఆయన వివరించారు.

అరుణాచల గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

కందుకూరు అర్బన్: సింగరాయకొండ నుంచి అరుణాచల గిరిప్రదక్షిణకు వచ్చే నెల 3వ తేదీ సాయంత్రం 8 గంటలకు కందుకూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పెద్దశెట్టి తెలిపారు. ఈ యాత్ర సందర్భంగా శ్రీకాళహస్తి, తిరుత్తని, కంచి, శ్రీపురం గోల్డెన్ టెంపుల్, కాణిపాకం క్షేత్రాలను దర్శించుకోవచ్చన్నారు. టికెట్ ధర రూ.2,600లని, పూర్తి వివరాలకు 7382889870 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.